# ఆదిలాబాద్-మంచిర్యాల



నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

♦ నిర్మల్ ♦ కొమురంభీం ఆసిఫాబాద్

శుక్రవారం, 15 మార్చి 2024 8 పేజీలు


## వచ్చే విద్యా సంవత్సరానికి పూర్తి సౌకర్యాలతో ప్రభుత్వ పాఠశాలలను సిద్ధం చేయాలి

### - రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

**మంచిర్యాల ప్రతినిధి,మార్చి 14, సూర్య మేజర్ న్యూస్ :**




2024-25 విద్యా సంవత్సరానికి అన్ని ప్రభుత్వ పాఠశాలలను పూర్తి స్థాయి సౌకర్యాలతో సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి



శాంతికుమారి అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి విద్యాశాఖ కార్యదర్శితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, విద్యాశాఖ, గ్రామీణాభివృద్ధి, సంబంధిత శాఖల అధికారులతో పాఠశాలల మరమ్మత్తులు, సౌకర్యాల కల్పన, విద్యార్థినీ, విద్యార్థులకు ఏకరూప దుస్తుల ఏర్పాటు అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ నుండి ఏప్రిల్ 2వ తేదీ వరకు 10వ తరగతి వార్షిక పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ఈ క్రమంలో పరీక్షల నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరం ముగింపు అనంతరం 45 రోజుల వేసవి సెలవుల సమయంలో ప్రభుత్వ పాఠశాలలలో అవసరమైన మరమ్మత్తులు చేసి, అవసరమైన సౌకర్యాలను కల్పించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థినీ, విద్యార్థులకు అనుగుణంగా ఏకరూప దుస్తులు సిద్ధం చేయాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ జిల్లాలో 10వ తరగతి పరీక్షల నిర్వహణ కొరకు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉన్నామని, జిల్లాలో 9 వేల 637 మంది విద్యార్థినీ, విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని, ఇందు కొరకు 52 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు మాస్ కాపీయింగ్ను నియంత్రించేందుకు 52 మంది ముఖ్య పర్యవేక్షకులు, 52 మంది డిపార్ట్మెంటల్ అధికారులు, 4 మంది కస్టోడియన్లు, 545 మంది ఇన్విజిలేటర్లను నియమించడం జరిగిందని తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో అవసరమైన మరమ్మతులు చేపట్టి త్వరితగతిన పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మూత్రశాలలు, వంటశాల, భోజనశాల, త్రాగునీటి సౌకర్యం, పాఠశాల భవనాల మరమ్మత్తులు, అదనపు తరగతి గదుల ఏర్పాటుకు అవసరమైన పరిపాలన అనుమతులు మంజూరు చేసేందుకు సంబంధిత ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులకు ఏకరూప దుస్తులు విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యేలోగా సిద్ధం చేసేందుకు స్వయం సహాయక సంఘాల సమన్వయంతో విద్యార్థుల కొలతలు తీసుకునే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాహుల్, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సెక్టార్ అధికారులకు ఎన్నికల సంబంధిత ప్రతి అంశం తెలిసి ఉండాలి

### - జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

**మంచిర్యాల ప్రతినిధి,మార్చి14, సూర్య మేజర్ న్యూస్ :**

రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి,పోలింగ్ రోజు పాటించవలసిన నిబంధనలను ఎన్నికల అధికారులు పూర్తిగా తెలుసుకొని ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు పాలనాధికారి (స్థానిక సంస్థలు) బి.రాహుల్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతీలాల్, ఎల్.ఎ., ఆర్&ఆర్ ప్రత్యేక ఉప పాలనాధికారి




డి.చంద్రకళతో కలిసి సెక్టార్ అధికారులు,సెక్టార్ పోలీసు అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తరువాయి 2లో

## పార్లమెంట్ ఎన్నికలు సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు సహకరించాలి...జిల్లా పాలనాధికారి రాజర్షి షా

**ఆదిలాబాదు బ్యూరో,మార్చి14,సూర్య మేజర్ న్యూస్ :**

పార్లమెంట్ ఎన్నికలు సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు సహకరించాలని జిల్లా పాలనాధికారి రాజర్షి షా అన్నారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ఓటరు జాబితా, పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై ఆయన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు తూచ తప్పకుండా పాటించాలని, జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు పూర్తి



సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఇప్పటికే జాబితాలను రాజకీయ పార్టీలకు అందజేయడం జరిగిందని అన్నారు. ఒక పోలింగ్ సెంటర్లో ఇంతకుముందు 1500, ఇప్పుడు ఎలక్షన్ కమిషన్ 100 పెంచి 1600 చేయడం జరిగిందన్నారు. ఒక్క ఓటరుకి రెండు కిలో



మీటర్ల పైన దూరం ఉంటే ఆ సందర్భంలో మాత్రమే పోలింగ్ కేంద్రం పెట్టడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థుల ప్రచారం కొరకు గోడల పై రాతలు, సభలకు వాహన ర్యాలీలకు అనుమతులు తప్పనిసరిగా పొందాలన్నారు. ఎన్నికల ప్రచారంలో. ఎన్నికల నిబంధనలను అనుసరించాలని కోరారు.ఇంటివద్దే ఓటుహక్కు వినియోగించుకునేందుకు భారత ఎన్నికల కమిషన్ 85 సంవత్సరాలు పైగా వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించిందన్నారు. దీని కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని అన్నారు. అలాగే దివ్యాంగులు సదరం సర్టిఫికేట్ తప్పనిసరిగా వుండాలని అన్నారు.ఓటరు జాబితా పై వచ్చే మార్పుల పై ఎప్పటికపుడు సమావేశాలు, ప్రతి బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియా, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ రంగంలో యాంత్రీకీకరణ ఉపయోగించడం

### - రైతులకు దీనివల్ల ప్రయోజనం

8లో



# సెక్టార్ అధికారులకు ఎన్నికల సంబంధిత ప్రతి అంశం తెలిసిఉండాలి

## - జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

( మొదటి పేజీ తరువాయి )



ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని, ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సెక్టార్ అధికారులకు వారి విధులు, ఎన్నికల నియమావళి



సంబంధిత ప్రతి అంశం తెలుసుకొని ఉండాలని తెలిపారు. ప్రతి సెక్టార్ అధికారి పరిధిలో కనీసం 3 నుండి గరిష్టంగా 12 పోలింగ్ కేంద్రాలు ఉంటాయని, ఆయా పోలింగ్ కేంద్రాలలో త్రాగునీరు, ర్యాంపు, నీడ, మూత్రశాలలు, కనీస మౌళిక సదుపాయాలు పరిశీలించి, ఏమైనా అవసరం ఉన్నట్లయితే సంబంధిత సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి సమకూర్చాలని తెలిపారు. వల్నరబిలిటీ మ్యాపింగ్-1 నివేదిక వచ్చిన తరువాత సంబంధిత పోలింగ్ కేంద్రాలను సందర్శించి వాటి పరిధిలో నెలకొన్న సమస్యలను గుర్తించి ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రముఖుల సలహాలు తీసుకొని 3 రోజుల వ్యవధిలో వల్నరబిలిటీ-2, 3 నివేదికలు రూపొందించి అందించవలసి ఉంటుందని తెలిపారు. సెక్టార్ అధికారులకు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు వెళ్ళే ప్రతి రూట్ తెలిసి ఉండాలని, పోలింగ్ రోజు ఈ.వి.ఎం.,వి.వి. ప్యాట్లలో సమస్య తలెత్తినట్లయితే వెంటనే తీసుకోవలసిన చర్యలు, పోలింగ్ రోజు గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించే మాక్ పోలింగ్ ప్రక్రియపై వివరించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, ఇతరత్రా సంబంధిత పరికరాల పంపిణీ సమయంలో పోలింగ్ కేంద్రాల వారిగా కేటాయించిన ప్రకారం వచ్చిన వాటి వివరాలను పరిశీలించాలని తెలిపారు. సెక్టార్ అధికారులు నిర్వహించవలసిన విధులు, చేయవలసిన, చేయకూడని పనులపై భారత ఎన్నికల సంఘం వారిచే జారీ చేయబడిన హ్యాండ్బుక్, చెక్ లిస్టులను క్షుణ్ణంగా చదవాలని, ప్రతి అంశాన్ని తెలుసుకొని ఉండాలని, పోలింగ్, కౌంటింగ్ రోజులలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్వహించవలసిన విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఎలాంటి పొరపాట్లు జరిగినా భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వి.వి. ప్యాట్ల ఏర్పాటు, పోలింగ్ రోజున ప్రతి 2 గంటలకు పోలింగ్ శాతం, పోల్ అయిన ఓట్ల వివరాల నివేదిక, పోల్ ముగిసే సమయానికి ముందుగానే వచ్చి ఉన్న ఓటర్ల విషయంలో పాటించవలసిన నిబంధనలు, ఓటింగ్ ప్రక్రియ ముగిసిన తరువాత గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల సీలింగ్,ఇతరత్ర అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం పని తీరును వివరించారు. సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీసు అధికారులు సమన్వయంతో పని చేసి ఎన్నికలను విజయవంతం చేయడంలో తమ వంతు పాత్ర పోషించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీసు అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పెరిక కార్పొరేషన్ ఏర్పాటు హర్షనీయం

**మంచిర్యాల టౌన్,ఫిబ్రవరి 14,సూర్య మేజర్ న్యూస్:**

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక ఐబీ చౌరస్తాలో పెరిక కుల సంఘం నాయకులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెరిక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కుల సంఘం నాయకులు స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు,తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం స్వీట్లు పంచుతూ తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు.ఈ సందర్భంగా కుల సంఘం నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో చేసిన హామీలో భాగంగా కుల సంఘాల కార్పొరేషన్ ఏర్పాటు చేయడం శుభసూచకమని అన్నారు. ఈ కార్యక్రమంలో పెరిక కుల సంఘం జిల్లా, పట్టణ నాయకులు కారుకూరి చంద్రమౌళి, గోపి,బొప్పు సతీష్,మురళి,మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## సిసి రోడ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేసిన యం.పీ.పీ

**లక్ష్మణ చాంద,మార్చి 14,సూర్య మేజర్ న్యూస్,**

మండలంలోని కనకపూర్ గ్రామంలో గురువారం బీజేపీ పార్టీ మండల నాయకులు ఎంపీపీ అద్వల పద్మ రమేష్ 20 లక్షల రూపాయల వ్యయంతో సిసి రోడ్ల పనులకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. నిర్మల్ శాసన సభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి కృషితో 20 లక్షల రూపాయల నిధులను మంజూరు చేసినట్లు వారు తెలిపారు. రానున్న రోజులలో మరిన్ని అభివృద్ధి పనులను చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు సుంకు ముత్తన్న, గాండ్ల చిన్నయ్య, వేణు గౌడ్, శ్రీను బీజేపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిచిత్ర పటానికి కి పాలాభిషేకం చేసిన ముదిరాజ్‌లు

### -ముదిరాజ్‌లను బీసీ (డీ) నుండి బీసీ (ఏ )లో చేర్చాలి



**బోథ్ టౌన్ మార్చ్ 14,సూర్య మేజర్ న్యూస్**

బోథ్ మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద బోథ్ మండల ముదిరాజ్ కార్యవర్గం ఆధ్వర్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘ నాయకులు మాట్లాడుతూ. బీసీ జనాభాలో అధిక మొత్తంలో ముదిరాజ్ కులస్థులు ఉన్నప్పటికీ గత ప్రభుత్వాలు మమల్ని పక్కన పెట్టడం జరిగింది. కానీ, కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం ఎంతో గొప్ప విషయం అని,ఈ కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు గాను నేడు బోథ్ మండల కేంద్రంలో వారి చిత్ర పటానికి పాలాభిషేకం చేయడం జరిగిందని తెలిపారు. అలాగే బీసీ (డీ)లో ఉన్న ముదిరాజ్ లను బి.సి(ఏ)లో చేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ కార్యదర్శి సలేంద్ర శివయ్య తెలంగాణ ముదిరాజ్ ఉపాధ్యక్షులు బొజ్జ నారాయణ బోథ్ మండల్ అధ్యక్షులు జూంగల భోజన్న గౌరవ అధ్యక్షులు భోజరాజు ప్రధాన కార్యదర్శి బొజ్జ సాయన్న,కోశాధికారి తుమ్మ మహిపాల్,ఉపాధ్యక్షులు రాజు,యూత్ అధ్యక్షులు మెండు శ్రీనివాస్,సోషల్ మీడియా కన్వీనర్ తుమ్మ శ్రీధర్,ముత్యం,శ్రీనివాస్ గంగాధర్, పాల్గొన్నారు.

## వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంబించిన గ్రామస్తులు

**సిరికొండ,మార్చి14 ,సూర్య మేజర్ న్యూస్**

సిరికొండ మండలంలోని సుంకిడి గ్రామంలో రాజరాజేశ్వరి



యూత్ అధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ గ్రామ పటేల్ దేవరీ మహాజన్ గ్రామ పెద్దలు అధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభించారు ఈ సందర్భంగా గ్రామ పటేల్ మాట్లాడుతూ క్రీడాకాలతో కలిసి టాస్ వేసి సర్వీస్ బంతిని విసిరి ప్రారంబించి ఉత్సాహపరిచారు.ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ మెస్రం గోపిచంద్,సిడం జంగు, మహాజన్, మెస్రం ఇంద్రు, ఆత్రం జలపతిరావు, సిడం మహదు, సిడం జైతు, కుమరం జంగు, పెందూర్ జంగు, రాజరాజేశ్వరి యూత్ యువకులు సిడం శశికాంత్, ఆత్రం బండు, మెస్రం చంద్రకాంత్, కుమరం మధుకర్, భీంరావ్, సిడం రఘురాం, గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.

## ప్రపంచ కిడ్నీ దినోత్సవం

**ఆదిలాబాద్,మార్చి 14,సూర్య మేజర్ న్యూస్**

ప్రపంచ కిడ్నీ దినోత్సవం భాగంలో ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రి దయాలసిస్ కేంద్రంలో కిడ్నీ దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరిండెంట్ శ్రీ ఉపేందర్ మాట్లాడుతూ కిడ్నీవ్యాధిగ్రస్తులు పౌష్టికాహారం తీసుకోవాలని, మద్యపానం ధూమపానానికి దూరంగా ఉండాలని అలాగే ప్రతి ఒక్క రోగికి బస్ పాస్ ఇచ్చిఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ మహేందర్ సార్ కపిల్ సార్ నర్సింపార్టెంట్ విమల సాజిత్ యూనియన్ అధ్యక్షులు సుభాష్ దయాలసిస్ ఇంచార్జి మమ్మద్ అత్తర్,సాయి,శివ



రంజిత్ సరిత సచిన్ ఆరోగ్యశ్రీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సూర్య
శుక్రవారం,15 మార్చి 2024

## కడెం ప్రాజెక్టు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



**కడెం,మార్చి 14, సూర్య మేజర్ న్యూస్:**

నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టు వరద గేట్ల మరమ్మత్తుల పనులను ఖానాపూర్ ఎమ్మెల్యే వెద్మ బొజ్జు పటేల్ ప్రారంభించారు.ఇటీవల రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కడెం ప్రాజెక్టు మరమ్మత్తుల కొరకు 5 కోట్ల 46 లక్షల రూపాయల నిధులు మంజూరు చేయగా గురువారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెద్మా బొజ్జు పటేల్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి కడెం ప్రాజెక్టు మీద ఉన్న మైసమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రాజెక్ట్ మరమ్మత్తుల పనుల కొరకు కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు.గత ప్రభుత్వాల పాలనలో కడెం ప్రాజెక్టును పట్టించుకున్న పాపాన పోలేరన్నారు. రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. వచ్చే వర్షాకాలం ప్రారంభంకు ముందే ప్రాజెక్టు మరమత్తుల పనులను పూర్తి చేసి సిద్ధంగా ఉంచాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించినట్లు తెలిపారు.ఇందులో ఎంపిపి అలెగ్జాండర్, తుమ్మల మల్లేష్, సతీష్ రెడ్డి మూస్కు రాజు, దుర్గం రాజేష్, సత్యం వాజిద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పోచమ్మ బోనాల పండుగ



**కడెం మార్చి 14, సూర్య మేజర్ న్యూస్:**

నిర్మల్ జిల్లా కడెం మండలం ధర్మాజీపేట్ గ్రామ పంచాయతీ పరిధిలోని కుర్రగూడెం గ్రామంలో పోచమ్మ ఆలయ వార్షికోత్సవంలో భాగంగ పోచమ్మ బోనాల పండుగ ఉత్సవాలు గురువారం రోజున కన్నుల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు ఒక్క ప్రొద్దలతో బోనాలు వండుకొని డప్పుచప్పులు వాయిద్యాల మధ్య ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి చేరుకొని మహిళలు భక్తులు పోచమ్మ తల్లికి బోనాలు నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలతో గ్రామంలో పూర్తిగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న సృష్టి పాఠశాలపై చర్యలు తీసుకోవాలి- ఐక్య విద్యార్థి సంఘం

**మంచిర్యాల టౌన్,మార్చి 14,సూర్య మేజర్ న్యూస్:**

మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ నస్పూర్ మండలంలోని సృష్టి పాఠశాల పై చర్యలు తీసుకొని సీజ్ చేయాలి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జీవో ఎంఎస్ నెంబర్ వన్ ప్రకారం కనీస సౌకర్యాలు లేకుండా ఒకే భవనంలో ఇల్లు,స్కూలు,హాస్టల్ కోచింగ్ సెంటర్లు నిర్వహిస్తూ అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారు. అర్హత లేని ఉపాధ్యాయులతో విద్యాబోధన చేస్తున్నారని ఆరోపించారు. పాఠశాల భవనంకు ఫైర్ యంత్రాలు కూడా సరిగా లేవని, విద్యార్థులకు మానసిక ఉల్లాసం కోసం గ్రౌండ్ కూడా లేని పరిస్థితి,గ్రిల్స్ కూడా లేవని విద్యార్థులకు ఏదైనా జరగరానిది జరుగుతే ఎవరు బాధ్యత వహిస్తారని అని అన్నారు. కనీస సౌకర్యాలు లేకుండా నడిపిస్తూ విద్యను వ్యాపారం చేస్తూ ధనర్జనే ధ్యేయంగా దోచుకుంటూ నడిపిస్తున్నారని అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా సృష్టి పాఠశాల ఇస్తున్న లావాదేవీలకు లాలూచీపడి వారి పై ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ మండిపడ్డారు. తక్షణమే అధికారులు



విచారణ జరిపి చర్యలు తీసుకొని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో విజెఎస్ జిల్లా అధ్యక్షుడు బచ్చల ప్రవీణ్ కుమార్, ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షుడు జుమ్మిడి గోపాల్,బిసివిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ సల్మాన్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## ఐఎన్‌టిఎస్ఓలో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ



**మంచిర్యాల టౌన్,మార్చి 14, సూర్య మేజర్ న్యూస్:**

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గోదావరి రోడ్ శ్రీ చైతన్య పాఠశాలలో డిసెంబర్ 2023 వ సంవత్సరం నిర్వహించిన ఇండియన్ నేషనల్ టాలెంట్ సర్చ్ ఒలంపియాడ్ ఫలితాలు గురువారం విడుదల అయ్యాయి. ఈ టెస్ట్ లో మంచిర్యాల శ్రీ చైతన్య పాఠశాల లక్ష్మి నగర్ బ్రాంచ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ టెస్ట్ లో లక్ష్మీ నగర్ శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన 95 మంది విద్యార్థులు పాల్గొనగా,సెగ్గం రిత్విక 3వ తరగతి బంగారు పతకంతో 2వ ర్యాంకు సాధించింది. గౌరిశెట్టి అశ్విత 7వ తరగతి,దుర్గి అవినాష్ 4వ తరగతి బంగారు పతకాలతో 4వ, 5వ ర్యాంకులు సాధించారు.పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులకు ప్రత్యేక బహుమతులతో పాటు,31 మంది విద్యార్థులకు కన్సలేషన్ బహుమతులు వచ్చాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అయూబ్ శ్రీ చైతన్య స్కూల్ చైర్మన్ మల్లంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రాజు, కోటేశ్వరరావు కోఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలన్నింటినీ త్వరలోనే పరిష్కారిస్తాం - ఎమ్మెల్యే వెద్మ బొజ్జు



**ఖానాపూర్,మార్చి14, సూర్య మేజర్ న్యూస్:**

ఖానాపూర్ ప్రాంతంలోని సమస్యలన్నింటినీ త్వరలోనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు అన్నారు. ఈ సందర్భంగా ఖానాపూర్ పట్టణంలోనీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో నివాసముంటున్న ప్రజలు త్రాగునీటి సమస్య ఉందని కొద్ది రోజుల క్రితం మున్సిపల్ చైర్మన్‌కి తెలిపారు. ఈ విషయాన్ని గురువారం రోజున మున్సిపల్ చైర్మన్ ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ కి సమస్యను వివరించడంతో గురువారం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో నివాసం ఉన్న ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రాగునీటి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని, ఇప్పుడు తాత్కాలికంగా వేసవి కాలంలో వాటర్ ట్యాంకర్లను ఏర్పాటు చేపిస్తామని అలాగే ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలని సమస్యల పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు.

### పాఠశాలలో నూతన తరగతులకు భూమి పూజ...

ఖానాపూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరియు పాత ఎల్లపూర్, మస్కాపూర్ గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో పలు నూతన తరగతి గదుల నిర్మాణానికి ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ భూమి పూజ చేసారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుకోవడానికి విద్యార్థులకు స్థలం సరిపోకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని, దానిని దృష్టిలో పెట్టుకొని, పలు పాఠశాలలో కాలేజీలలో, నూతన తరగతి గదులకు భూమి పూజ చేశామని అన్నారు. విద్యార్థులు ప్రతి ఒక్కరు బాగా చదువుకొని తల్లిదండ్రులను బాగు చేసుకుంటూ ,ఉద్యోగాలు సాధించాలని తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని అన్నారు . వేరు వేరుగా జరిగిన కార్యక్రమంలో ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం , వైస్ చైర్మన్ కావలి సంతోష్ , కౌన్సిలర్స్ నాయకులు జన్నరపు శంకర్ , నాయిని సంతోష్,పరిమి సురేష్ , షబ్బీర్ పాషా , నాయకులు పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, నంది రామయ్య, మైనార్టీ మండల ప్రసిడెంట్ సలీం ఖాన్, తోట సత్యం, అసిఫ్ అలి తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

**కడెం,మార్చి 14, సూర్య మేజర్ న్యూస్:**

కడెం మండలంలోని లింగాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. లింగాపూర్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 77 మంది పదవ తరగతి విద్యార్థుల కు పదివేలు విలువ గల పరీక్ష ప్యాడ్ లను, పెన్నులు, పెన్సిల్లను పంపిణీ చేశారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ రాబోయే పరీక్షలలో మంచి ఫలితాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమం లో గౌరవ అధ్యక్షులు దానవేణి మల్లేష్, అధ్యక్షులు బొమ్మిడి మహేశ్వర్,ప్రధాన కార్యదర్శి ఉప్పులూటి గంగారాం, కుర్ర శేఖర్, బొమ్మిడి రాజేందర్, వేములవాడ రమేష్, భట్టి కృష్ణ, జడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, మాజీ



సర్పంచ్ ఆకుల బాలవ్వ, ప్రధానోపాధ్యాయుడు వెంకట రమణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సూర్య



# బెల్లంపల్లి పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో పోలీస్ ట్రైనింగ్ కళాశాల ఏర్పాటు

**- ఉమెన్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకు కృషి**

**- రామగుండం పోలీస్ కమిషనర్ ఎన్ శ్రీనివాస్**

**బెల్లంపల్లి, మార్చి 14, సూర్య మేజర్ న్యూస్:**

తెలంగాణ రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన బెల్లంపల్లి పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో రానున్న రోజుల్లో పోలీస్ ట్రైనింగ్ కళాశాల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపనున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం సాయంత్రం బెల్లంపల్లి పట్టణంలోని వన్ టౌన్ ,టూ టౌన్ ,తాళ్ల గురిజాల ఏసిపి, పోలీస్ హెడ్ క్వార్టర్స్, ఏ ఆర్ ఏ సి పి కార్యాలయాలను ఆకస్మికంగా పోలీస్ కమిషనర్ తనిఖీ చేశారు.





అనంతరం బెల్లంపల్లి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపి మాట్లాడారు. బెల్లంపల్లిలో రోజురోజుకు జనాభా పెరుగుతున్న దృష్ట్యా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేకంగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, మహిళల కేసులను నియంత్రించేందుకు మహిళా పోలీస్ స్టేషన్ లను బెల్లంపల్లిలో ఏర్పాటు కొరకు ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తామని సిపి తెలిపారు. బెల్లంపల్లి పోలీస్ హెడ్ క్వార్టర్స్ నెలకొన్న సమస్యలు, సిబ్బంది నియామకాలు, పోలీస్ హెడ్ క్వార్టర్స్ అభివృద్ధి తదితర అంశాలపై అధికారులతో చర్చించినట్లు సిపి తెలిపారు. రానున్న రోజుల్లో జరుగునున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కోడ్ అమలులోకి వస్తున్నందున ఎన్నికల నియమ నిబంధనలపై ఈనెల 16వ తేదీన రామగుండం పోలీస్ కమిషనర్ స్థాయిలో పోలీస్ అధికారులకు సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు సిపి తెలిపారు. సింగరేణి ప్రాంతంలో బెల్లంపల్లికి ఎంతో ప్రత్యేకత ఉందని రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ఎలాంటి సంఘటన జరగకుండా నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు సీ పీ తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పెద్దపల్లి మంచిర్యాల రెండు జిల్లాల్లోని పలు సర్కిల్ ఏసిపి కార్యాలయాల్లో పోలీసుల విధులు ఎదుర్కొంటున్న సమస్యలురాను ఎన్నికల్లో ప్రతిష్ట భద్రతను పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలను సమీక్షించేందుకు అన్ని పోలీస్ స్టేషన్లను , సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయాలను, ఏసిపి కార్యాలయాలను తనిఖీ చేస్తున్నామని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ విషయాలపై ఎప్పటికప్పుడు పోలీసు అధికారులను అప్రమత్తం చేస్తూ పటిష్ట భద్రతను ,నిఘాను పటిష్టం చేస్తున్నట్లు వారు తెలిపారు. సీ పీ వెంట బెల్లంపల్లి ఏసిపి ఏ రవికుమార్ , ఏ ఆర్ ఏ సీపీ సురేందర్ ,రిజర్వ్ ఇన్స్పెక్టర్ సంపత్ ,రూరల్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ ఆఫ్జల్ లోద్దీన్, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఎన్ దేవయ్య, ఎస్ఐలు సమ్మయ్య, జి నరేష్, బి రమేష్, ఆర్ తిరుపతి తదితరులు ఉన్నారు.

# షిరిడిని తలపించిన కుచులాపూర్ సాయిబాబా వార్షికోత్సవం

**తలమడుగు,14 మార్చ్ సూర్య మేజర్ న్యూస్**

తలమడుగు మండలంలోని కుచులాపూర్ గ్రామంలో 28వ సాయిబాబా వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ వారు గ్రామస్తులు అంగరంగ వైభవంగా పురస్కరించుకొని గత మూడు రోజుల నుంచి ఎల్లమ్మ కథ,ప్రవచనాలు చేస్తూ భక్తులను ఎప్పటికప్పుడు భక్తి మార్గంలో నిలపడానికి అనేక సాంస్కృతిక సాంప్రదాయ కార్యక్రమాలను చేపడుతూ వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా ఆలయ కమిటీ మరియు గ్రామ అభివృద్ధి కమిటీ దగ్గరుండి వేడుకలను ఘనంగా జరిపారు.సాయిబాబాను దర్శించుకోవడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి అదేవిధంగా సాయిబాబా భక్తులు మహారాష్ట్ర నుంచి కూడా అధిక సంఖ్యలో హాజరై సాయిబాబాను దర్శించుకుని వారి కోరికలను మొక్కుకున్నారు.ఈ ఆలయంలో గల బాబాను దర్శించుకుంటే కోరుకున్న కోరికలు నెరవేరుతాయని మండల జిల్లా అధికారులు ప్రజాప్రతినిధులు హాజరవుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వచ్చిన అతిథులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాలతో సత్కరించరు.ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆలయ అభివృద్ధి కమిటీ ప్రజాప్రతినిధులు అధికారులు అనధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.









# నేడు జిల్లాకు సీతక్క

**-పర్సనల్ అసిస్టెంట్ టు మినిస్టర్ సతీష్ బండారి**

**ఆసిఫాబాద్ ప్రతినిధి 14 మార్చ్ సూర్య మేజర్ న్యూస్**

జిల్లాకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటిపారుదల, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) నేడు రానున్నారని పర్సనల్ అసిస్టెంట్‌టు మినిస్టర్ సతీష్ బండారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15వ తేదీ ఉదయం 7.15 గంటలకు జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయాన్ని ప్రారంభిస్తారని, 7.45 గంటలకు గుండి పెద్ద వాగు వంతెనను పరిశీలించి 9 గంటలకు కెరమెరి మండలం జోడేఘాట్ లోని కొమురం భీం గిరిజన మ్యూజియంను సందర్శిస్తారని తెలిపారు. జిల్లా ప్రభుత్వ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో సిద్ధంగా ఉండాలని తెలిపారు.

## ఆసిఫాబాద్ పట్టణంలోని భరోసా సెంటర్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ కే సురేష్ కుమార్

**ఆసిఫాబాద్ ప్రతినిధి ,14 మార్చ్ సూర్య మేజర్ న్యూస్**

ఆసిఫాబాద్ పట్టణం నందు గల భరోసా సెంటర్ ను కొమరం





భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కే సురేష్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళల భద్రతకు భరోసనిస్తూ, మహిళలు , పిల్లల సమస్యల తక్షణ పరిష్కారం చూపటమే లక్ష్యంగా ఈ భరోసా సెంటర్ ఏర్పాటు చేయడమైందని , కావున బాధితులకు సత్వర న్యాయం చేసే దిశగా పనిచేయాలని భరోసా సెంటర్ సిబ్బందికి తెలిపారు. బాధితుల నుండి అందిన కంప్లైంట్ వెంటనే పరిశీలించి సత్వర సేవలు అందించాలని అన్నారు. అనంతరం ఎస్పీ సంబంధిత రికార్డ్స్ ను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, టాస్క్ ఫోర్స్ మరియు స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రాణా ప్రతాప్ , డి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ రమేష్ ,భరోసా సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

## యువజన కాంగ్రెస్ ప్రచార కరపత్రాలను విడుదల

**నేరడిగొండ,మార్చ్ 14,సూర్యమేజర్ న్యూస్**

మోడీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లండి దేశంలో సంవత్సరానికి సగటుగా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని ఇప్పటివరకు ఉద్యోగాల ఉసేత్తని, విద్యా ఉపాధి పథకాలు ప్రజలకు అందకుండా చేసి ప్రభుత్వ శాఖలను నెరవేర్యం చేస్తూ ప్రైవేటైజేషన్ను ప్రోత్సహిస్తున్న నరేంద్ర మోడీ యువతరానికి చేస్తున్న మోసాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి యువకులందరినీ ఐక్యం చేయాలని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సాయిచరణ్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా నేరడిగొండ మండల కేంద్రంలోని పార్టీ ఆఫీస్ కార్యాలయం దగ్గర బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ భోథ్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆడే గజేందర్ తో కలిసి యువజన కాంగ్రెస్ ప్రచార కరపత్రాలను విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు బద్దం పోతారెడ్డి, జిల్లా కార్యదర్శులు గుడాల అనిష్, ఎల్మ వినయ్ రెడ్డి,బోథ్ అసెంబ్లీ కమిటీ సభ్యులు మరియు అన్ని మండలాల అధ్యక్షులు మరియు మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# 10వ తరగతి వార్షిక పరీక్షలకు పకడ్బంధీగా నిర్వహించాలి
## జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

**మంచిర్యాల,మార్చి14, సూర్య మేజర్ న్యూస్ :**
జిల్లాలో ఈ నెల 18 నుండి ఏప్రిల్ 2వ తేదీ వరకు జరుగనున్న 10వ తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో 10వ తరగతి పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 18 నుండి ఏప్రిల్ 2వ తేదీ వరకు జరుగనున్న 10వ తరగతి పరీక్షల నిర్వహణ కొరకు జిల్లాలో 52 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, 9 వేల 637 మంది విద్యార్థినీ, విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షల నిర్వహణ కొరకు 52 మంది ముఖ్య పర్యవేక్షకులు, 52 మంది డిపార్ట్మెంటల్ అధికారులు, 4 మంది సంరక్షకులు, 545 మంది ఇన్విజిలేటర్లను నియమించడం జరిగిందని, పరీక్షలలో ఎలాంటి మాస్ కాపీయింగ్కు తావు లేకుండా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇంటర్మీడియట్ పరీక్షల మాదిరిగా 10వ తరగతి పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నిబంధనల మేరకు పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేసి 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు



సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునే విధంగా ఆర్.టి.సి. ద్వారా సమయానుకూలంగా బస్సులు నడిపించడం జరుగుతుందని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షా కేంద్రాలలో త్రాగునీరు, మూత్రశాలలు, పారిశుద్ధ్యం, నిరంతర విద్యుత్ సరఫరా సౌకర్యాలు కల్పించడంతో పాటు అత్యవసర సేవల నిమిత్తం వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. పరీక్షా కేంద్రంలోనికి మొబైల్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించడం జరుగదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. యాదయ్య, మంచిర్యాల ఎ.సి.పి. ప్రకాష్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్రావు, మున్సిపల్ కమీషనర్లు, విద్యుత్ శాఖ ఎస్.ఈ., మండల విద్యాధికారులు, వైద్య-ఆరోగ్య శాఖ, ఆర్.టి.సి. అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పండుగలను మతసామరస్యంతో ప్రశాంతంగా జరుపుకోవాలి- జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్ రావు

**ఆసిఫాబాద్ ప్రతినిధి ,14 మార్చ్ సూర్య మేజర్ న్యూస్**
జిల్లాలో అన్ని పండుగలను మతసామరస్యంతో ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్ రావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశం మందిరంలో జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్, ఆసిఫాబాద్ డి.ఎస్.పి. సదయ్య, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మున్సిపల్ కమిషనర్లు భుజంగరావు, అంజయ్య లతో కలిసి ముస్లిం మత పెద్దలు, మస్జిద్ కమిటీ సభ్యులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ రంజాన్ మాసం ప్రారంభమైనందున ప్రజలందరూ మత సామర్థ్యంతో పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మస్జిద్ ల వద్ద పారిశుధ్యం, విద్యుత్ సరఫరా, త్రాగునీరు సౌకర్యాలు కల్పించాలని, మస్జిద్ ల వద్ద ప్రార్థన సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. మున్సిపాలిటీలు, మండల కేంద్రాలలో మస్జిద్ ల వద్ద పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా ఉండేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని, నిరంతరాయంగా విద్యుత్ సరఫరాతో పాటు త్రాగునీటి ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. సాయంత్రం వేళలో ప్రార్థన సమయంలో పెట్రోలింగ్ నిర్వహించేలా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని, శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో ఇంచార్జ్ మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి సజీవన్, ఆసిఫాబాద్ తహసిల్దార్ శ్రీనివాస్ రావు, ముస్లిం మత పెద్దలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గతంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

**బెల్లంపల్లి, మార్చి 14, సూర్య మేజర్ న్యూస్:**
బెల్లంపల్లి నియోజకవర్గం మైలారం గ్రామ పంచాయతీ సమీపాన మత్తడి వాగులలో ఉన్న త్రాగునీటి బావి బోరు ద్వారా గత 30 సంవత్సరాలుగా త్రాగు నీటితో ప్రజలకి సేవలు అందిస్తున్న మంచి నీటి బోరు బావి గతః 2 ఏండ్లుగా త్రాగు నీటి ఎద్దడితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని త్రాగు నీటి బావిలో ఇసుక కూరుకుపోవడంతో గత నెల రోజుల నుండి ఎండల తీవ్రత వల్ల బావిలో నీరు నిల్వ లేక 1 గంట నడిస్తే బోరు కాలిపోవటం మరల మరమ్మత్తులు చేయటం తప్పా పూర్తి పరిష్కారం దొరకలేదని, త్రాగు నీరు లేక మిషన్ భగీరథ నీరు వచ్చిన ఆ నీరు త్రాగితే అనారోగ్య సమస్యలతో ప్రజల నానా ఇబ్బందులు పడుతున్నాము అని ప్రజలు తమ అవేదని వ్యక్తం చేస్తూ గతంలో ఉన్న ప్రభుత్వ ప్రజా ప్రతినిధులకి చెప్పుకున్న పట్టిచ్చుకొకపోవటంతో ఇట్టి సమస్య గురించి 2022 మే నెలలో గ్రామ ప్రజలు బొమ్మెన హరీష్ గౌడ్ ద్వారా గడ్డం వినోద్ వెంకటస్వామి దృష్టికి తీసుకువెళ్ళగా తప్పకుండా మనం అధికారంలోకి రాగానే ఆ సమస్యకి పూర్తి పరిష్కారం చేద్దాం ఇచ్చిన మాట ప్రకారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు గురువారం జెసిబి ఏర్పాటు చేసి వాగులోనే నీటి కాలువని జెసిబి ద్వారా బావి వద్దకు నీటిని మళ్ళించి వాగులోని నీరు బావి వద్దకు వచ్చి నిలిచేలా చేసి బావిలోకి ఊట ద్వారా నీరు నిల్వ అయ్యేలా చేసి మరల త్రాగు నీరు ఇంటింటికీ అందేలా చేసి త్రాగు నీటితో మరల పూర్వ వైభవం తీసుకువచ్చి మంచి నీటిని గ్రామ ప్రజలకి అందించేలా చేయటం జరిగింది అని హరీష్ గౌడ్ గొల్లపల్లి ఎంపిటిసి తెలిపారు. దీనితో ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి కి గ్రామ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.



## అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ స్వాధీనం యజమాని పై కేసు నమోదు



**లక్ష్మణచాందా, మార్చి 14,సూర్య మేజర్ న్యూస్,**
మండల కేంద్రంలోని చింతల్ చాంద గ్రామ శివారులో గల గోదావరి నది నుండి గురువారం ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ను స్వాధీన పరచుకుని ట్రాక్టర్ యజమాని అయిన బైట్కర్ నాగన్న పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే వారిపై కూడా కేసు నమోదు అవుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పోషణ పక్షంప్రోగ్రాంలో భాగంగా ఎంపీడీవో రాజ్ వీర్ అంగన్వాడీ సందర్శన

**నేరేడిగొండ,మార్చ్ 14,సూర్యమేజర్ న్యూస్**
అంగన్వాడీ కేంద్రంలో గురువారం పోషణ పక్షంప్రోగ్రాంలో భాగంగా ఎంపీడీవో రాజ్ వీర్ మాట్లాడుతు అంగన్వాడీ సేవలు అందరూ వినియోగించు కోవాలని చిరుధాన్యాలు బాలామృతం తో చేసిన పదార్థం స్థానికంగా దొరికే పండ్లు మొలకలు వచ్చిన విత్తనాలు మునగాకు ఆకుకూరలు గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు ,కిషోర్ బాలికలు తీసుకోవలసిన పోషకాహారం పైన అవగాహన కల్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్ వీర్ ఐసిడిఎస్ సూపర్వైజర్ మంజుల మరియు తల్లులు, డ్వాక్రా మహిళలు,కిషోర బాలికలు అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.



## గోవిందా గోవిందా...



**తలమడుగు,14 మార్చ్ సూర్య మేజర్ న్యూస్**
ఆంధ్రప్రదేశ్లో తిరుమల తిరుపతి దేవస్థానం ఎంత ప్రసిద్ధి చెందినదో అదిలాబాద్ జిల్లా నలుమూలల బరంపూర్ కొండపై ఉన్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి అంతే ప్రసిద్ధి చెందారు. గత మూడు రోజుల నుంచి పండగ వాతావరణం నెలకొంది తలమడుగు మండలంలోని బరంపూర్ గుట్టపై వెలసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు శ్రీనివాసుడి కళ్యాణ మహోత్సవానికి వేలాది సంఖ్యలో భక్తులు తరలివస్తు స్వామిని దర్శించుకొని వాళ్ళ మొక్కులను తీర్చుకుంటున్నారు. గుట్టపై ఉండటంతో ఇక్కడికి చుట్టుపక్కల ప్రజలే కాకుండా మహారాష్ట్ర నుంచి ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుట్టపై నుంచి కింది వరకు ప్రతాన్ని తీసుకురావాలంటే చాలా కష్టం కానీ ప్రజలంతా ఏకమై స్వామివారి రథాన్ని భక్తులు తాళ్లతో పట్టుకొని సాయంత్రం గుట్టపై నుంచి కింద ప్రజలున్న వరకు రతాన్ని భక్తులంతా సాంస్కృతిక సాంప్రదాయ నృత్యాలు చేస్తూ వైభవంగా తీసుకువచ్చారు ఈ రథోత్సవం చూడ్డానికి ఇక్కడికి చాలామంది భక్తులు ఆసక్తిగా వస్తారు. ఉదయం నుంచి వచ్చిన భక్తులందరికీ మహా అన్నదానం కార్యక్రమాన్ని ఆలయ కమిటీ గారు నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్నీ చర్యలు తీసుకొని వైభవంగా జాతరను పూర్తి చేశారు.



# మార్కెట్ కు రాని శనిగే రైతు






**బోథ్ ,మార్చ్ 14,సూర్య మేజర్ న్యూస్**

బోథ్ మండలంకేంద్రంలోని మార్కెట్ కమిటీ లో ప్రారంభమైన శనిగే కొనుగోలు కేంద్రాలకు తమ పంటను అమ్ముకోవడానికి ఆసక్తి చూపడం లేదు. మండల కేంద్రంలో మార్కుఫెడ్, నాఫీడ్ ధ్వారా పిఎసిఎస్ చైర్మన్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ లు కలిసి మార్చ్ 12 న చెనిగే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.ప్రభుత్వం చనిగ పంటకు క్వింటాలుకు 5440/-గ మద్దతు ధరను ప్రకటించింది. కాని, దలరులు, మధ్యవర్థులు క్వింటాలుకు 5400/- కె రైతుల ఇంటి వద్దకే వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులంత తమ పంటని దళారులకే అమ్మడానికి ఆసక్తిని చూపిస్తున్నారు. ఒకవేళ రైతు తన పంటను మార్కెట్కు తీసుకుపోయి మార్కుఫెడ్ కు అమ్మాలనుకుంటే వాహన చార్జీలు,అమాలి చార్జీలు పెరుగుతాయని. మార్కెట్లో తమ పంటను లారీలలో నింపే వరకు అక్కడే ఉండాల్సి వస్తుంది అని రాత్రిళ్ళు కూడా అక్కడే పడుకోవాల్సి వస్తుందని దీంతో తాము నష్టపోతామని రైతులు మార్కెట్కు వచ్చి మార్కుఫెడ్ కు తన పంటను అమ్ముకోవడానికి ఇష్టపడటం లేదు.

# విద్యార్థులా? పనోల్లా?

**- విద్యార్థులకు తాగునీటి బాధ - నిబంధనలను పాటించని పాఠశాల యాజమాన్యం - పట్టించుకోని అధికారులు**



**బెజ్జూర్,మార్చి 14, సూర్య మేజర్ న్యూస్:**

బెజ్జూర్ మండల కేంద్రంలోని జ్యోతిబా పూలే విద్యాలయంలో విద్యార్థులు పని వాళ్ళలా పనిచేస్తున్న ఘటన చోటుచేసుకుంది.గత కొన్ని నెలలుగా విద్యార్థులు సైకిల్ పై పాఠశాలకు తాగునీటిని తీసుకువస్తున్నారు.తమను ఉపాధ్యాయులే నీటిని తెమ్మని పంపినట్లు విద్యార్థులు వాపోతున్నారు.ఇట్టి పాఠశాల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలను పాటించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.పాఠశాల స్థాపించాలంటే తప్పనిసరిగా ఫైర్ మరియు తగు మౌలిక వసతులు ఉండాల్సి ఉన్నప్పటికీ అవి ఏవి లేకుండా,అర్హత లేని ఉపాధ్యాయులతో విద్యను బోధిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.పాఠశాలను ఇప్పటివరకు ఉన్నతాధికారులు కూడా ఎవరు పట్టించుకోకపోవడం వల్లే పాఠశాల యాజమాన్యం తమకు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.పాఠశాలలో ఒకటి నుంచి ఏడవ తరగతి వరకు విద్యార్థులు విద్యానభ్యసిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలపై చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# నేను సింగరేణి కార్మికున్ని, కింది స్థాయి నుంచి కష్టపడి పైకి వచ్చిన వాడిని

**- నేను సాదాసీదా మనిషిని, నాకు ఎలాంటి వ్యాపారాలు లేవు ఎప్పుడూ ప్రజలతో మమేకమైన ఉండేవాన్ని - తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం రాజీనామాకు ముందు ముందు వరుసలో ఉన్నా - మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్**

**బెల్లంపల్లి, మార్చి 14, సూర్య మేజర్ న్యూస్:**

పెద్దపల్లి పార్లమెంటరీ నియోజకవర్గంలో రానున్న లోక్ సభ ఎన్నికల్లో నేపథ్యంలో బెల్లంపల్లి, కాశీ పేట మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశం నిర్వహించి, దిశానిర్దేశం చేసిన మాజీ మంత్రి పెద్దపల్లి పార్లమెంటరీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య.ఈ సమావేశంలో కొప్పుల మాట్లాడుతూ తెలంగాణ రాక ముందు ఈ ప్రాంతం ఎలా ఉందో మనకు తెలుసు వైద్యం, విద్య, వ్యవసాయం పై పూర్తిగా నిర్లక్ష్యం, తెలంగాణ అంటేనే ఆకలి చావులు, వరుసలు, రైతుల ఆత్మహత్యలు, ఈ పరిస్థితికి కారణం కాంగ్రెస్ పార్టీ కాదా అన్నారు. 60 సంవత్సరాల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయింది.తెలంగాణ వచ్చిన కెసిఆర్ ముఖ్యమంత్రి గా కెసిఆర్ అయిన తరువాత దండుగ అన్నా వ్యవసాయాన్ని పండుగ చేసింది నిజం కాదా అని అన్నారు. ఇప్పుడు అసాధ్యం కాని, హామీలతో అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పాలనలో చూస్తే మళ్లీ 60 సంవత్సరాలు వెనక్కి పోయినట్లు ఉంది.ప్రభుత్వం ఉద్యోగులకు మొదటి తేదీనే జీతం ఇస్తా, అని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ జీతాలు వేస్తుందో.. ప్రజలు గమనిస్తున్నారు. ఈ కాంగ్రెస్ పార్టీ పరిపాలన రైతు బంధు అడిగితే చెప్పు తీసి కొడతా అంటున్న మంత్రులు ముఖ్యమంత్రి , పూర్తిగా స్పృహ కోల్పోయి మాట్లాడుతున్నారు. ఈ అబద్దాలతో అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ని గ్రామ గ్రామాల్లో నిలదీసే రోజులు రానున్నాయి అన్నారు. ఇప్పుడు ప్రజలకు అర్థం అవుతుంది, ఎప్పుడూ బిఆర్ఎస్ పార్టీని ఎందుకు పోగుట్టుకున్నామని బాధపడుతున్నారు. టిఆర్ఎస్ పార్టీ



అధికారం కోల్పోయిందని కార్యకర్తలు అధైర్య పడవద్దు. కార్యకర్తలు మీ గుండె మీద చెయ్యి వేసుకుని, చెప్పండి, కెసిఆర్ 9 సంవత్సరాల పరిపాలన తప్పుడు పనులు చేసారా, కాలేశ్వరం అంటే కెసిఆర్.. కెసిఆర్ అంటే కాళేశ్వరం, కాళేశ్వరం ప్రాజెక్టు ను కావాలని బద్నాం చేసే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ. నేను సింగరేణి కార్మికున్ని, కింది స్థాయి నుంచి కష్టపడి పైకి వచ్చిన వాన్ని, నేను సాదాసీదా మనిషిని, నాకు ఎలాంటి వ్యాపారాలు లేవు ఎప్పుడూ ప్రజలతో మమేకమైన ఉండేవాన్ని,తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం రాజీనామాకు ముందు ముందు వరుసలో ఉన్నాను, అని కొప్పుల ఈశ్వర్ గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో కొప్పుల ఈశ్వర్ గెలవచ్చు కాని అది నా గెలుపు కాదు.. మీ అందరి గెలుపు. ఈ పార్లమెంటరీ పరిధిలో ప్రజల కోసం ఈ గెలుపు కావాలి.కాంగ్రెస్ పార్టీ డ్రామా కంపెనీ ఈ ఆరు గ్యారెంటీలు అమలు చేస్తాం అనుకున్నాం కాని ఎన్నికల కోడ్ వచ్చిందని నాటకానికి తెర లేపుతారు. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన కెసిఆర్ ను ఇష్టం వచ్చినట్టు బూతులు ప్రస్తుత ముఖ్యమంత్రి మాట్లాడుతున్నాడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ సీనియర్ నాయకులు కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీడీవో రాజ్ వీర్ కందకాల పరిశీలన

**నేరడిగొండ ,మార్చ్ 14,సూర్యమేజర్ న్యూస్**

నేరడిగొండ మండలంలో ఎన్ఆర్ఈజీఎస్ ఉపాధి హామీ పనులు జరుగుతున్న సందర్భంగా సవర్గం గ్రామంలో ఉపాధి హామీ కూలీలు తవ్వుతున్న కందకాలను ఎంపీడీవో రాజ్ వీర్ పరిశీలించారు కూలీలతో మాట్లాడుతూ అందరు పనులు సక్రమంగా చేయాలని మాట్లాడారు అనంతరం బుగ్గారం గ్రామంలో నర్సరీలలో పెరుగుతున్న మొక్కలను పరిశీలించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్ వీర్ ఏపీవో వసంత్ ఫీల్డ్ అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.



# షాదీఖానా స్థలం కబ్జా పై నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై అదనపు కలెక్టర్ కు ఫిర్యాదు

**బెల్లంపల్లి, మార్చి 14, సూర్య మేజర్ న్యూస్:**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణం షాంషీర్ నగర్‌లో గల షాదీఖానా స్థలాన్ని ఎక్కడో నిర్మితమై ఉన్న ఎవరిదో ఇంటి పై రెండు తప్పుడు నెంబర్లు తీసుకొని షాదీఖానా భూమిని కబ్జా చేసి 57,39,000 అక్షరాలా యాభై ఏడు లక్షల ముప్పై తొమ్మిది వేల రూపాయలకు క్రయ విక్రయాలు జరిపినరు ఇట్టి విషయము పై ప్రజాభవన్‌లో ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా బెల్లంపల్లి తహసీల్దార్ విచారణ చేసి వాస్తవానికి ఈ స్థలం అప్పట్లో పంజాయతీ రాజ్ సెక్రటరీకి అప్పజెప్పినారని అలాగే ప్రభుత్వ నిధులతో కొంత నిర్మాణము జరిగినట్లు పేర్కొంటూ జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ అలాగే మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని మెమో (మెమో ఆర్.పి.సి.నెం.బి/138/2024-13, తేదీ 09-03-2024( నాడు జారీ చేయడం జరిగింది. దీనిపై చర్యలు తీసుకోకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని అదనపు కలెక్టర్ రాహుల్ కు ఫిర్యాదు చేయడం జరిగింది.ఫిర్యాదు చేసిన వారిలో అన్వర్ ఖాన్, ఖలీద్, అమానుల్లాహ్ ఖాన్, అయ్యుబ్ తదితరులు పాల్గొన్నారు.



## 108 వాహనంలో ప్రసవం



**వాంకిడి, మార్చి 14,సూర్య మేజర్ న్యూస్**

మండలంలోని దొడ్డిగూడ గ్రామానికి చెందిన ఆత్రం మారుబాయి అనే మహిళ 108 వాహనంలో ఆడ శిశువుకు జన్మనిచ్చినట్లు ఈఎమి పవర్ రాజా. పైలెట్ భీంరావు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. అందిన సమాచారం మేరకు గురువారం ఉదయం 4 గంటలకు దొడ్డిగూడ గ్రామానికి వెళ్లి మారుబాయిని 108 వాహనంలో ఎక్కించి ఆసుపత్రికి తరలించే క్రమంలో పురిటి నొప్పులు ఎక్కువ అవ్వడంతో మార్గ మధ్యలోనే డెలివరి చేసినట్లు తెలిపారు. పుట్టిన బిడ్డ, తల్లి క్షేమంగా ఉన్నారని.. వారిద్దరిని వాంకిడి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించినట్లు పేర్కొన్నారు.

## భైంసాలో ఘనంగా జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం

**భైంసా,మార్చి 14,సూర్య మేజర్ న్యూస్**

భైంసా పట్టణంలోని ఐలమ్మ గద్దె ముందర జన సేన పార్టీ 11 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి.



ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా జనసేన పార్టీ నాయకులు సుంకెట మహేష్ బాబు జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఆటో యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులకు,ప్రజలకు,పండ్ల పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసైనికులకు,జనసేన నాయకులకు,వీరమహిళలకు జనసేన ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియచేయడం జరిగింది."సర్వ జన హితం సదా ప్రజా పక్షం,సమ సమాజ స్థాపనకై పూరించిన సమర శంఖం,ఇదే జనసేన ప్రస్థానం అంటూ నవశకానికి మనదైన ముద్ర వేస్తూ,సుపరిపాలనే ధ్యేయంగా తెలుగు రాష్ట్రాల అభివృద్ధి కొరకు,ప్రజాశ్రేయస్సు కోసం,ఆంధ్ర ప్రదేశ్ లో జరగబోయే రేపటి ఎన్నికల తుదిపోరులో గెలుపు బాటకై ఉత్సాహంతో ముందుకు వెళదాం అని అన్నారు.ఈ కార్యక్రమంలో జన సైనికులు విద్యాసాగర్,ముత్యం ,ప్రకాష్,మహమ్మద్,రాజు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య మంత్రిని కలిసిన ముధోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావు పటేల్

**భైంసా,మార్చి 14,సూర్య మేజర్ న్యూస్**



రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ను ముధోల్ మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణ రావు పాటిల్ మర్యాదపూర్వకంగా కలిశారు.అలాగే నియోజకవర్గ పరిధిలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు,బస్తీ దవాఖానాలతో పాటు,స్థానిక ఏరియా దవాఖానా సమస్యలు,డయాలసిస్ కేంద్రాల నిర్వహణ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు.

## గురుకుల టీజీటీ ఉపాధ్యాయ ఉద్యోగం పొందిన ఉపాధ్యాయునికి ఘనంగా సన్మానం

**భైంసా,మార్చి 14 ,సూర్య మేజర్ న్యూస్**



భైంసా పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పులేనగర్ పాఠశాలలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న అంకం శంకర్ ఇటీవల తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన గురుకుల టీజీటీ ఉద్యోగానికి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు.అనంతరం వారు మాట్లాడుతూ ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా నిరంతర కృషితో ఉద్యోగం పొందిన శంకర్ కు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు రమేష్ మాశెట్టివార్,స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు శైలేష్ మాశెట్టివార్,మేంచు గంగయ్య, డాక్టర్ రాజారెడ్డి,డాక్టర్ నాగేష్,బాలాజీ ఎర్రవర్,అడెపు శ్రీనివాస్,నాగమణి లింగన్న,జిలకరి రాజేశ్వర్, రాజన్న,మోహన్ బచ్చువార్,పాఠశాల ప్రధానాచార్యులు బి.దేవేందర్, పాఠశాల అకాడమిక్ ఇన్చార్జి సట్ల పోతన్న,ఆర్ఎస్ఎస్ ద్వికండ ప్రముఖ్ అనంత సాయి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలను అదిరోహించాలి - ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



**ముధోల్,14మార్చ్,సూర్య మేజర్ న్యూస్**

విద్యార్థులు లక్ష్యానికి అనుగుణంగా ముందుకెళ్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని స్థానిక ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. గురువారం నియోజకవర్గ కేంద్రంలోని కస్తూర్బ గాంధీ బాలికల విద్యాలయం అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోనే ఉన్నత జీవిత లక్ష్యం సాధ్యమన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా విద్యా, వైద్యం పై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు. విద్యభివృద్ధిలో భాగంగా కస్తూర్బా పాఠశాల అదనపు భవన నిర్మాణానికి 2.30 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు.నియోజకవర్గ కేంద్రంతో పాటు ఆయా మండలాల్లోని గ్రామాల్లో సైతం పటిష్ట విద్యకు తాము కట్టుబడి ఉన్నామన్నారు. ఎన్నికల ముందు తాను ఇచ్చిన స్వయం మేనిఫెస్టోను నియోజకవర్గ అభివృద్ధికై తప్పక అమలు చేస్తానని హామీ ఇచ్చారు.తాము చేసే అభివృద్ధిలో భాగంగా ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమం లో జిల్లా విద్యాధికారి రవీందర్ రెడ్డి , మండల విద్యాధికారి మైసాజీ,మాజీ జడ్పీటీసీ నర్సాగౌడ్, ఎంపీటీసీ దేవోజీ భూమేష్,మండల బీజేపీ అధ్యక్షులు కోరి పోతన్న,నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల అభ్యున్నతి కోసమే కొనుగోలు కేంద్రాలు -ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

**ముధోల్,14మార్చ్.సూర్య, మేజర్ న్యూస్**

రైతుల అభ్యున్నతి కోసమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగు తుందని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. గురువారం మండ లంలోని బోరిగాం గ్రామంలో ప్రొద్దు తి రుగుడు (సన్ ఫ్లవర్) కొనుగోలు కేం ద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావే శంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముధోల్ మండలంలో 441 ఎకరాల్లో రైతు లు ప్రొద్దు తిరుగుడు పంటలను పం డించినట్లు అన్నారు. రైతులు ఆరు కాలం కష్టం చేసి పండించిన పంటలకు మద్దతు ధర కొనుగోలు కేం ద్రాల్లోనే రైతులు పంటలను విక్రయించాలన్నా రు. క్వింటాల్ కు రూ. 6760 మద్దతు ధర ను చెల్లించుతుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దళారులక పంటలను అమ్మి రైతులు మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ముధోల్, కుబీర్ పీఏసీ ఎస్ చైర్మన్ లు వెంకటేష్ గౌడ్,గంగా చరణ్ గౌడ్, జడ్పిటిసి సరోజినీ సురేందర్ రెడ్డి , మాజీ జెడ్పిటిసి లక్ష్మి నర్సగౌడ్, ఎంపీటీసీ జ్యోతి,మాజీ సర్పంచ్ తులసి భాయి,పీఏసీఎస్ డైరెక్టర్ సుదర్శన్, ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, ఆయా మండలాల బిజెపి నాయకు లు,వ్యవసాయ అధికారులు,రైతులు, పాల్గొన్నారు.



## శిశు మందిర్ పాఠశాలలో ఘనంగా"ఫేర్వెల్ డే" వేడుకలు



**భైంసా,మార్చి 13,సూర్య మేజర్ న్యూస్**

భైంసా పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పులే నగర్ పాఠశాల 10వ తరగతి విద్యార్థులు "ఫేర్వెల్ డే" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులు ఆటపాటలతో నృత్యాలతో అలరించారు.కార్యక్రమంలో



భాగంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ విద్యార్థులు రాబోయే 10వ తరగతి పరీక్షల్లో బాగా చదివి 10/10 జీపిఏ సాధించే విధంగా కష్టపడాలని అన్నారు.అంతేగాకుండా క్రమశిక్షణతో ఉంటూ జీవితంలో ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షించారు.అనంతరం భైంసా పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ రాజారెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు.కార్యక్రమం అనంతరం పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులకు సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. అంతేకాకుండా పాఠశాల పదవ తరగతి విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల అభివృద్ధి కొరకు 48,000 రూపాయలను విరాళంగా అందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు రమేష్ మాశెట్టివార్,స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు శైలేష్ మాశెట్టివార్,మేంచు గంగయ్య, డాక్టర్ రాజారెడ్డి,డాక్టర్ నాగేష్,బాలాజీ ఎర్రవర్,అడెపు శ్రీనివాస్,నాగమణి లింగన్న,జిలకరి రాజేశ్వర్,గాలి రాజన్న,మోహన్ బచ్చువార్,పాఠశాల ప్రధానాచార్యులు బి.దేవేందర్, పాఠశాల అకాడమిక్ ఇన్చార్జి సట్ల పోతన్న,ఆర్ఎస్ఎస్ ద్వికండ ప్రముఖ్ అనంత సాయి, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



**ముధోల్,14మార్చ్,సూర్య , మేజర్ న్యూస్**

మండల కేంద్రమైన ముధోల్ లోని మహాలక్ష్మి వీధికి చెందిన తాటివార్ లాలు( రిటైర్డ్ తాసిల్దార్)ఇటీవల అనా రోగ్యం కారణంతో మృతి చెందారు. దీంతో గురువారం ఎమ్మెల్యే రామా రావు పటేల్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కష్ట సమయంలోనే ధైర్యంగా ఉండాలన్నారు. ఎమ్మెల్యే వెంట నాయకులు వెంగళరావు, తాటివార్ రమేష్ ,దత్తు ఉన్నారు.

## మిస్సింగ్ కేసు నమోదు

**వాంకిడి, మార్చి 14,సూర్య మేజర్ న్యూస్**

మండల కేంద్రంలోని లక్ష్మీనగర్ కాలనికి చెందిన ఖో బ్రగడె సంజీవ్ తన కూతురు రాత్రి అయిన తిరిగి ఇంటికి రాలేదని ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మీ నగర్ కాలనీకి చెందిన ఖోబ్రగడె సంధ్యారాణి మండల కేంద్రంలోని ఓ బట్టల దుకాణంలో పనిచేస్తుండేది. రోజు లాగే బుధవారం సైతం పనికి వెళ్లిన సంధ్యారాణి రాత్రి అయినా తిరిగి ఇంటికి రాలేదు. ఆ రోజు బందువులకు ఫోన్లు చేసిన అమ్మాయి జాడ లభించక పోవడంతో గురువారం పోలీస్ స్టేషన్లో అమ్మాయి తండ్రి ఫిర్యాదు చేశారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

## వ్యవసాయ రంగంలో యాంత్రీకీకరణ ఉపయోగించడం - రైతులకు దీనివల్ల ప్రయోజనం

**నిర్మల్ మార్చి 14, సూర్య మేజర్ న్యూస్**

వ్యవసాయ రంగంలో యాంత్రీకీకరణను ఉపయోగించుకోవడం వల్ల రైతులకు ఎంతో మేలు కలుగుతుందని కలెక్టర్ ఆశీష్ స్పాంగ్వాన్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ ప్రాంగణంలో ఇండియన్ ఫార్మర్స్ ఫర్టిలైజర్ కో ఆపరేటివ్ లిమిటెడ్ (ఇఫ్కో) వారి వ్యవసాయ డ్రోన్ ను ప్రారంబించారు. నానో యూరియా, నానో డీ.ఏ.పీ వంటి ఎరువులను సులభతరంగా పిచికారీ చేసుకోవచ్చని తెలిపారు. మహిళా సాధికారిత ను సాధించుటలో భాగంగా మహిళలకు వంద శాతం రాయితీతో ఈ డ్రోన్ లను అందించడం అభినందనీయమని మాట్లాడారు. గ్రామీణ యువత, మహిళలు,మహిళా సంఘాలకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశ్యంతో ఈ డ్రోన్ లను సమకుర్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, ఇఫ్కో ఎఫ్.వో వికాస్, ఎస్.ఎఫ్.ఏ సాగర్, నవీన్ ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ కమిషనర్ తో ఏరియా జిఎం సమావేశం



**మందమర్రి టౌన్, మార్చి 14, సూర్య మేజర్ న్యూస్.**

రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాసులుతో సింగరేణి మందమర్రి ఏరియా జిఎం ఏ మనోహర్ సమావేశమయ్యారు. గురువారం పర్యటనలో భాగంగా మందమర్రి పట్టణానికి విచ్చేసిన ఆయనను ఏరియా జిఎం కార్యాలయంలో ఏరియా జిఎం ఏ మనోహర్ మర్యాదపూర్వకంగా కలిసి, మొక్కను అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయనతో పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసిపి ఏ రవికుమార్, మందమర్రి సిఐ కే శశిధర్ రెడ్డి, పట్టణ ఎస్ఐ ఎస్ రాజశేఖర్, రామకృష్ణాపూర్ ఎస్ఐ జి రాజశేఖర్, ఏరియా ఎస్ఓటు జిఎం రాజేశ్వర్ రెడ్డి, సింగరేణి సీనియర్ సెక్యూరిటీ అధికారి రవి, పోలీస్ సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జ్యోతి నగర్ రెండో వార్డులో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**రామకృష్ణాపూర్, మార్చి 14, సూర్య మేజర్ న్యూస్**

క్యాతనపల్లి మున్సిపాలిటీ రెండో వార్డు జ్యోతి నగర్‌లోని చర్చి లైన్‌లో రెండు లక్షల మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులతో సీసీ రోడ్డు పనులను 2 వ వార్డు కౌన్సిలర్ పుల్లూరి సుధాకర్ ఆధ్వర్యంలో గురువారం పనులు ప్రారంభించారు, రోడ్డు పనుల ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ జంగం కళ, మున్సిపల్ వైస్ చైర్మన్ విద్యాసాగర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పల్లె రాజు, పిసిసి జనరల్ సెక్రెటరీ రఘునాథ్ రెడ్డి, డిసిసి అధికార ప్రతినిధి ఉడ్నాల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ మహంకాళి శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ గోపతి రాజయ్య, తవక్కల్ స్కూల్ విద్యా సంస్థల అధినేత అబ్దుల్ అజీజ్, మాజీ ఎంపిటిసి పుల్లూరి కళ్యాణ్, మున్సిపల్ కౌన్సిలర్ పనస రాజు పాల్గొని ప్రారంభించారు, ఈ సందర్భంగా చైర్ పర్సన్ జంగం కల కొబ్బరికాయ కొట్టి సిసి రోడ్డు పనులు ప్రారంభించారు, ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే డాక్టర్ వివేక వెంకట్ స్వామి చేస్తున్న అభివృద్ధిలో భాగంగా సిసి రోడ్డు పనులు ప్రారంభించామని రానున్న రోజులలో అన్ని వార్డులలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతాయని తెలిపారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బింగి శివ కిరణ్, ఎర్రబెల్లి రాజేష్, 13వ వార్డు కాంగ్రెస్ నాయకుడు, కలిగిరి కనకరాజు, 14వ వార్డు కాంగ్రెస్ నాయకులు ముటిక రవి యాదవ్, మేకల రమేష్ యాదవ్,రాజన్న,సత్యపాల్,ఆర్నె సతీష్, మల్లయ్య వార్డు నాయకులు జంగంపల్లి బానేష్, సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## విలేకరిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

**- ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలి - ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పోలీస్ కమిషనర్ కు వినతిపత్రం**



**మందమర్రి టౌన్, మార్చి 14, సూర్య మేజర్ న్యూస్.**

ఇటీవల చెన్నూరు ప్రజాజ్యోతి పత్రిక రిపోర్టర్ వెంకటేష్ పై దాడి చేసిన దుండగులను పట్టుకుని, వారిని కఠినంగా శిక్షించాలని, మరోమారు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని మందమర్రి ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి గాండ్ల సంజీవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పట్టణ పోలీస్ స్టేషన్ తనిఖీ కొరకు విచ్చేసిన రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాసులు లకు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గాండ్ల సంజీవ్ మాట్లాడుతూ పత్రిక విలేకరులు నిరంతరం ప్రజా సమస్యలపై కథనాలు వార్తలు రాస్తుంటారని వారిపై రాజకీయ నాయకులు కక్షగట్టి ప్రజాస్వామ్యంలో కీలక పాత్ర పోషిస్తున్న పత్రిక విలేకరులపై దాడులకు పాల్పడడం సమంజసం కాదని, ప్రజాస్వామ్యంలో ఇలాంటివి తగవని తెలిపారు. అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ, ప్రజల సమస్యలు వెలుగులోకి తెస్తేనే ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. జర్నలిస్టు వెంకటేష్ పైన దాడి పాల్పడిన దుండగులను వెంటనే కఠినంగా శిక్షించాలని, అదేవిధంగా మరోమారు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లిలో పంపులు వేశారు నీళ్లు మరిచారు.

**బెల్లంపల్లి, టౌన్ మార్చి 14 సూర్య మేజర్ న్యూస్**

బెల్లంపల్లిలో అన్ని వార్డులలో ముఖ్యంగా 33 వ వార్డులలో నీటి సమస్య ఎక్కువగా ఉందని, ప్రజలు అంటున్నారు. వారు



మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇంటింటికి నీటి కులాయి ఇచ్చిందే తప్ప ఇంతవరకు నీరు వచ్చే దాఖలాలు లేవని మంచినీళ్ల కోసం ఇబ్బందులు పడుతున్నామని, ఎండాకాలం మొదలైందని తాగడానికి నీరు లేక ఇబ్బంది, పాలు అవుతున్నామని , డబ్బులు పెట్టుకొని కొనే స్థితిలో మేము లేమని ఎమ్మెల్యే వినోద్ మా కష్టాలను అర్థం చేసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి తమ కష్టాలను తీర్చాలని, ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా మున్సిపల్ అధికారులు స్పందించి బోర్లన్నీ మురాయిస్తున్నాయి కాబట్టి కె వాటిని బాగుచేయాలని, మున్సిపల్ అధికారులను ప్రజలు కోరుతున్నారు.

## పద్మశాలి కార్పోరేషన్ ఏర్పాటు చేయడం హర్షనీయం

**లక్షెట్టిపేట,సూర్య మేజర్ న్యూస్:** మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో గురువారం విశ్రాంతి భవనంలో ముఖ్యమంత్రి.రేవంత్ రెడ్డి చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు , బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు. తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమర్థపు మురళి .వీరి సహకారంతో తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర కాబినెట్ లో పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు చేయడానికి నిర్ణయం తీసుకున్నందుకు అభినందనలు తెలియజేయడం జరిగింది. పద్మశాలి సంఘ నాయకులు మాట్లాడుతూ పద్మశాలీల కొరకు ఐదువేలకోట్లరూపాయల నిధులు ఏర్పాటు చేయాలని అలాగే ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు. పద్మశాలిల కొరకు ప్రతి గ్రామంలో, మండలంలో సంఘ భవనలు ఏర్పాటు కొరకు. నిరుపేద పద్మశాలీల ఉపాధి కొరకు కృషి చేయాలని కోరుకోవడం జరిగింది.. ఈ కార్యక్రమంలో వేముల రాజగురువయ్య, బైరి సత్యనారాయణ, బండి రాజలింగు,బొప్పు కిషన్, వెంగలదాసు రాజు, నడిమెట్ల రాజన్న,కోమాకుల రవి, కోమాకుల రాము, అంకం రాజేశం, గుండ శోభన్,వేముల మల్లేష్, వేముల మధు,గాదాసు నరేష్, కట్ల శంకర్, హన్మండ్ల శంకర్, గంగుల లచ్చన్న, గుండు లక్ష్మణ్,మాటేటి రమేష్, కట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



**కాగజ్ నగర్, 14 మార్చి, సూర్య మేజర్ న్యూస్:**

బీఆర్ ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప గురువారం సాయంత్రం తన అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. స్థానిక వినయ్ గార్డెన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క సమక్షంలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పతోపాటు జిల్లా పరిషత్ ఇన్చార్జ్ చైర్మన్ కోనేరు కృష్ణారావు, మున్సిపల్ చైర్మన్ షాహిన్ సుల్తానా, మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేందర్, పాలకవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులతో పాటు మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ప్రకటించారు .ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే కోనేరు కొనప్పతో పాటు ఇతర ప్రజా ప్రతినిధులు, అనుచరులను పార్టీలో ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు విశ్వ ప్రసాద్ రావు, కాంగ్రెస్ పార్టీ సిర్పూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ రావి శ్రీనివాస్‌తో పాటు పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే

**ఖానాపూర్ రూరల్ మార్చ్ 14,సూర్య మేజర్ న్యూస్**

ఖానాపూర్ పట్టణంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో నివాసముంటున్న ప్రజలు త్రాగునీటి సమస్య ఉందని మొన్న మున్సిపల్ చైర్మన్‌కి తెలియజేయడంతో మున్సిపల్ చైర్మన్ ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మా బోజ్జు పటేల్ సమస్యను వివరించడంతో గురువారం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో నివాసం ఉన్న ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రాగునీటి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని, ఇప్పుడు తాత్కాలికంగా వేసవి కాలంలో వాటర్ ట్యాంకర్లను ఏర్పాటు చేపిస్తామని, అలాగే ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలని సమస్యల పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం వైస్ చైర్మన్ కావలి సంతోష్ కౌన్సిలర్స్ నాయకులు జన్నరపు శంకర్ నాయిని సంతోష్ పరిమి సురేష్ షబ్బీర్ పాషా నాయకులు పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్,మైనార్టీ మండల ప్రసిడెంట్ సలీం ఖాన్, మైనారిటీ టౌన్ . ప్రెసిడెంట్. షౌకత్ పాషా తోట సత్యం, అసిప్ అలి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఐఎఫ్టియు ఆధ్వర్యంలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల డ్యూటీ టైం మార్చాలని డివైఎస్ఈ కి మెమోరండం

**రామకృష్ణాపూర్, మార్చి 14, సూర్య మేజర్ న్యూస్**

రామకృష్ణాపూర్ సివిల్ ఆఫీస్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల డ్యూటీ టైం ను ఎండాకాలం ఎండల ను దృష్టిలో పెట్టుకొని మార్చాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఐ ఎఫ్ టి యు ఆధ్వర్యంలో రామకృష్ణాపూర్ సివిల్ డివైఎస్ఈ శ్రీధర్ కు మెమోరండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డి .బ్రహ్మానందం. మాట్లాడుతూ.. మందమర్రి డివిజన్ పరిధిలోని రామకృష్ణాపూర్‌లో విధులు నిర్వహిస్తున్న సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ఎండాకాలం ఎండల ను దృష్టిలో పెట్టుకొని ప్రతి సంవత్సరం లాగే డ్యూటీ టైం ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మార్చి 18 నుండి జులై 15వ తేదీ వరకు డ్యూటీ టైం మార్చాలని కోరుతున్నాము ఎండాకాలంలో ఎండలకు కార్మికులు అనేక రకాల వ్యాధులకు గురి అవుతుంటారు. ప్రధానంగా వడ దెబ్బ, కండ్లు తిరిగి పడిపోవడం ఇలాంటి సమస్యలు తరచుగా జరుగుతుంటాయి. కనుక ఈ కార్మికులకు డ్యూటీ టైం మార్చలని కోరుతున్నాం. అలాగే సింగరేణి కాంటాక్ట్ కార్మికులు వేడి నుండి కార్మికులు తట్టుకోవడం కొరకు ఓ.ఆర్.ఎస్, ప్యాకెట్స్, మజ్జిగ ప్యాకెట్లు సింగరేణి యాజమాన్యమే పంపిణీ చేసి సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల ప్రాణాలను ఎండ నుండి రక్షించాలనీ డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గజ్జి మల్లేష్, కందుల వెంకటేష్, మహేష్, సాయి కిరణ్, రాణి, సునీత, శారద, తదితరులు పాల్గొన్నారు.